విలేకరులు కావలెను

99492 22450

www.suryaa.news



ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

26-3-2026

వెల: రూ.5/-

పేజీలు: 8

సంపుటి: 01

సంచిక: 205

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# మంగళగిరిలో ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ..

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని కొప్పురావుకాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేశ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ హనుమత్, లక్ష్మణ, సీతాసమేత రాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్

మిగతా 2లో

# తెలంగాణలో మరో కొత్త పార్టీ..

- మార్చి 27న ప్రకటించనున్న కవిత..
- ముహూర్తం ఖరారు..



# పాకిస్తాన్ "బ్రోకర్ దేశం", మనం కాదు..

ఇరాన్ యుద్ధం ఆపేందుకు పాక్ మధ్యవర్తిత్వం..

ఆల్ పార్టీ మీట్‌లో ఇచ్చిపడేసిన జైశంకర్..





# పెట్రోల్ కొరత..

- కొన్నిచోట్ల యాజమాన్యాల 'నో స్టాక్' బోర్డులు
- పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన
- సోషల్ మీడియాలో వార్తలు, వదంతులతో కలవరం
- కిక్కిరిసిన బంకుల్లో పడిగాపులు
- అవసరం లేకున్నా ట్యాంకులు నింపుకుంటున్న వైనం
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు

హైదరాబాద్‌లో సరిపడా నిల్వలు

కంపెనీలు, డీలర్లదీ అదే మాట

హైదరాబాద్: ఇంధనం సెగ రాష్ట్రంలోని వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆయిల్ కొరత వార్తలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయితే దేశంలో ఎక్కడా చమురు కొరత లేదని కేంద్రం స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే విషయం పదేపదే చెబుతోంది. ఆయిల్ కంపెనీలు సైతం సరిపడా డీజిల్, పెట్రోల్ నిల్వలున్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటనలిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గత రెండు

మిగతా 2లో



# కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాజీనామా లేఖ.. నాలుగు దశాబ్దాల ప్రయాణానికి సెలవు
- రేవంత్‌రెడ్డి ప్లాన్ ప్రకారం పార్టీలో చేరి సీఎం అయ్యిండు
- పార్టీని సొంత ఆస్తిగా భావిస్తున్నాడు
- అడ్డొస్తే తొక్కుతా అంటున్నారు.. ఎంత మందిని తొక్కుతారు..?
- చంద్రబాబు, కేసీఆర్‌నే ఎదిరించా.. ఇక రేవంత్‌తోనే పోరాటం

కార్యకర్తల సమావేశంలో జీవన్‌రెడ్డి

2లో

## రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం..!

అమరావతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం మాధవి పాల్గొన్నారు. సీతారాముని పేట

మిగతా 2లో



# ఇరాన్‌కు అమెరికా 15 ప్రతిపాదనలు

- అంగీకరిస్తే నెల పాటు కాల్పుల విరమణ
- తిరస్కరించిన ఇరాన్, అమెరికాకు 8 షరతులు
- ఒప్పుకుంటేనే యుద్ధం ఆగుతుందని స్పష్టికరణ
- కొనసాగిన ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు
- అబ్రహాంలింకన్ యుద్ధ నౌకపై దాడి: ఇరాన్
- మందెబ్ జలసంధిని మూసేస్తానని హెచ్చరిక
- కువైట్ విమానాశ్రయంలో భారీ మంటలు



ఇస్లామాబాద్: పశ్చిమాసియా కల్లోలానికి తెర దించే దిశగా బుధవారం మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. యుద్ధాన్ని ఏదోలా ముగించే ప్రయత్నాల్లో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఈ విషయమై ఇరాన్ ముందు 15 ప్రతిపాదనలుంచారు. వాటికి అంగీకరిస్తే తొలుత నెల రోజుల పాటు కాల్పుల విరమణకు సిద్ధమని పేర్కొన్నారు. కానీ వాటిని ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.



# ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంప్రతిష్టాత్మకం...
- రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక...
- స్థానికసర్పంచ్‌లకూ పూర్తి అధికారం
- ఇళ్లలో ఉండకుంటే ఇతరులకు కేటాయింపు...
- ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్

మిగతా 2లో



## ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా

# అభివృద్ధి లక్ష్యం

ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో పర్యాటకశాఖ ఎంఓయూ..!

ఏపీ పర్యాటక శాఖ ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ మధ్య ఎంఓయూ

సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని

# ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా అభివృద్ధి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# పాకిస్తాన్ "బ్రోకర్ దేశం", మనం కాదు..

మిడిల్ ఈస్ట్ సంక్షోభం నేపథ్యంలో ఈరోజు(బుధవారం) ఢిల్లీలో ఆల్ పార్టీ సమావేశం జరిగింది. ఇరాన్ యుద్ధం సమయంలో భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం, చమురు సంక్షోభం రాకుండా తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలకు తెలియజేసింది. అయితే, ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం "దళాల్ దేశం" కాదని స్పష్టం చేశారు. పాక్ మధ్యవర్తిత్వం గురించి ప్రతిపక్షాలు ప్రశ్నించిన తర్వాత, ఈ విమర్శలకు జైశంకర్ తనదైన శైలిలో చెక్ పెట్టారు. పాకిస్తాన్‌ను "బ్రోకర్ దేశం"గా అభివర్ణిస్తూ.. భారతదేశం ఎవరి మధ్య మధ్యవర్తిత్వం చేయదని చెప్పారు. భారత్ తన దేశ అవసరాలను మాత్రమే పట్టించుకుంటుందని ప్రభుత్వం సూటిగా చెప్పింది. ఇరాన్ యుద్ధాన్ని ఆపేందుకు ఇరాన్-యూఎస్ మధ్య పాకిస్తాన్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తల నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పాక్ మధ్యవర్తిత్వం చేస్తుందనే వార్తలు వెలువడిన తర్వాత మోడీ సర్కార్‌పై కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. జైరాం రమేష్ వంటి వారు పాక్ మధ్యవర్తిత్వం చేస్తుంది, ఇండియా ఆ పని కూడా చేయలేకపోతుందని ఎద్దేవా చేశారు. ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. ఇరాన్ అమెరికా మధ్య చర్చలకు ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈరోజు జరిగిన ఆల్ పార్టీ మీటింగ్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన వహించారు. ఇందులో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి,విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి పాల్గొన్నారు. ప్రతిపక్షాలైన బీజేడీ నుంచి సస్మిత్ పాత్రా, జేడీయూ నుంచి లల్లన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ హాజరయ్యారు.

# మంగళగిరిలో ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ..

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి తనవంతుగా రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం..!

(మొదటి పేజీ తరువాయి)

కూడలి నుంచి నీలాచలం కొండ వరకు సుమారు 3.70 కిలోమీటర్ల మేర ఈ గిరిప్రదక్షిణ మార్గాన్ని నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.3.40 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. శ్రీరామ నవమికి ముందే భక్తులకు ఈ మార్గాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం రాళ్లు, ముళ్లతో నిండిపోయి ఉండేది. అయినప్పటికీ భక్తులు ఎంతో కష్టపడి ప్రదక్షిణ చేసేవారు. ఈ సమస్యలను స్థానిక ప్రజలు, ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం స్పందించి, మార్గాన్ని సౌకర్యవంతంగా మార్చింది.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. గత 20 నెలల్లో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఇతర నిధుల ద్వారా రూ.40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. ఇప్పటికే శ్రీకాళహస్తి ఆలయం గిరిప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, అలాగే కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గానికి రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు.

# పెట్రోల్ కొరత..



(మొదటి పేజీ తరువాయి)

మూడురోజులుగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరి కన్పిస్తున్నారు. గంటలకొద్దీ పడిగాపులు పడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు కిక్కిరిసి ఉంటున్నాయి. కొన్ని బంకులు నిరాటంకంగా పని చేస్తుంటే.. కొన్నిచోట్ల మాత్రం బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కన్పిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం, చమురు, సహజ వాయువుల కొరత వార్తల నేపథ్యంలో ఈ నో స్టాక్ బోర్డులు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాహనదారులు అవసరం ఉన్నా, లేకపోయినా డీజిల్, పెట్రోల్ ట్యాంక్ నిండా నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏరోజు కారోజు ఇంధనం నింపుకునే క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ వర్కర్లు, సామాన్య ప్రజలు కూడా ఎంతో కొంత అదనంగా ట్యాంకు నింపుకోవాలని చూస్తుండటంతో తెరిచి ఉన్న బంకుల వద్ద క్యూలు పెరిగిపోతున్నాయి. కొందరు సీసాలు, పెద్దపెద్ద క్యాన్లు, డ్రమ్ముల్లో సైతం ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని బంకులు మూతపడి కన్పిస్తుండటంతో వాహనదారుల్లో ఆందోళన రెట్టింపవుతోంది. బంకులు మూత పడి ఉండటానికి 'నో క్రెడిట్' సమస్య ప్రధాన కారణమని తెలుస్తుండగా..ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీల ప్రకటనలను పట్టించుకోకుండా ప్రజలు ఎక్కడ పెట్రోల్, డీజిల్ దొరుకుతోందో తెలుసుకొని మరీ కొనుగోళ్లు చేస్తుండటంతో తెరిచి ఉన్న బంకులు కిక్కిరిసిపోయి కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడో మొదలైనా..సోమవారం సాయంత్రం నుంచే బంకుల వద్ద డీజిల్, పెట్రోల్ కోసం వాహనదారులు క్యూలు కట్టడం ప్రారంభించారు. ఆ ఫొటోలు టీవీలు, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో చమురు కొరతపై భయాందోళనలు మొదలయ్యాయి. బంకులన్నీ వాహనదారులతో నిండిపోవడం మొదలయ్యింది. మంగళ, బుధవారాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

ఇంధన కంపెనీల లెక్కల ప్రకారం రాష్ట్రంలోని సుమారు 3,600 పెట్రోల్ బంకులకు సాధారణంగా రోజుకు సగటున 13,752 కిలోలీటర్ల ఇంధనం అవసరం ఉంటుంది. తదనుగుణంగా ఆయిల్ కంపెనీలు సగటున 14,729 కిలోలీటర్లు సరఫరా చేసేవి. కానీ ప్రస్తుతం డిమాండ్ ఒక్కసారిగా 17,246 కిలోలీటర్లకు చేరింది. దీనికి అనుగుణంగా ఆయిల్ కంపెనీలు కూడా సరఫరాను 17,898 కిలోలీటర్లకు పెంచినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటికీ కొన్ని బంకులు నోస్టాక్ బోర్డులతో మూతపడి కన్పిస్తున్నాయి. మరికొన్ని బంకులు వాహనాలతో కిక్కిరిసి ఉంటున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల్లో రెట్టింపు స్థాయిలో పెట్రోల్ విక్రయాలు పెరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం విక్రయాలు జరగ్గా, 23న ఇది రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుంది.

# ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం

హైదరాబాద్: పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా భావించే సొంతింటి కలను పెద్ద ఎత్తున నిజం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హయాంలోనే అత్యధికంగా 21 లక్షల ఇళ్లు పేదలకు కట్టించారని తెలిపారు. తిరిగి తమ ప్రభుత్వమే ఈ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోందని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ తదితరులు లేవనెత్తిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశం సుదీర్ఘ చర్చకు దారితీసింది. అధికార, విపక్ష సభ్యులు ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. వీటన్నింటికీ మంత్రి పొంగులేటి బదులిచ్చారు. పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని తాము ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో దీనికే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారానికి 1.12 లక్షల ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం, పంపిణీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2,31,206 ఇళ్లు మంజూరు చేశారని, వీటిల్లో 1,62,936 ఇళ్లు కొన్ని మౌలిక వసతులు మినహా పూర్తయినట్టు తెలిపారు. నాణ్యత విషయంలో వచ్చిన ఆరోపణలపై థర్డ్ పార్టీ విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తామన్నారు.

**లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు**

ఇళ్లు కేటాయించినా, చాలాచోట్ల లబ్ధిదారులు నివాసం ఉండడం లేదని మంత్రి తెలిపారు. అధికారులతో దీనిపై ఇటీవల సమీక్షించినట్లు చెప్పారు. దీనిపై 6,500 మందికి నోటీసులిస్తే, 4,500 మంది మాత్రమే స్పందించారని వెల్లడించారు. మరో రెండు నెలల్లో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకపోతే, ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేటాయించిన 12 వేల ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయిస్తామని, పాత కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే ఇతరులకు అప్పగిస్తామని వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

జగిత్యాల: కాంగ్రెస్‌లో నాలుగు దశాబ్దాలపాటు ఉన్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. బుధవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని బందారి గార్డెన్స్‌లో అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య రాజీనామా చేశారు. ఆ లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ తనదనే ధోరణిలో రేవంత్ మాట్లాడుతున్నారని, అడ్డొస్తే తొక్కుతా అంటున్నారని, ఎంతమందిని తొక్కుతారని ప్రశ్నించారు. ఏదో ఒకరోజు అందుకు ముగింపు తప్పదన్నారు. ఆ ముగింపు జగిత్యాల నుంచే ప్రారంభమవుతుందన్నారు. తాను ఎదగకుండా అణగదొక్కాలన్నదే రేవంత్‌రెడ్డి ఆలోచన అని, అయినప్పటికీ ఎదిరించి పోరాటం చేయడం తనకేం కొత్త కాదని తెలిపారు. కేసీఆర్, చంద్రబాబు వంటి వారితోనే పోరాటం చేశానని, ఇక నుంచి రేవంత్‌పైనే తన పోరాటమని వ్యాఖ్యానించారు. రేవంత్‌కు ఎదిరించే వారు వద్దని, రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వారిని అణగదొక్కుతున్నారని జీవన్‌రెడ్డి చెప్పారు. నేను 1984లో కాంగ్రెస్‌లో చేరిన. పార్టీతో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉంది. అలాంటి అనుబంధాన్ని వదులుకోవాలని ఎవరూ కోరుకోరు. జరిగిన అవమానాలతో విధిలేని పరిస్థితుల్లో పార్టీని వీడుతున్నా. స్థానిక సంస్థల్లో ఒక సమయంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోతే ఒంటరిగా గెలిపించా. కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వారికే మళ్లీ పార్టీలో స్థానం కల్పించారు. విధిలేని పరిస్థితుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని, మీ హక్కులకు భంగం కలగనివ్వబోమని కేసీ వేణుగోపాల్, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. అయినప్పటికీ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకంలో జాప్యం చేశారు. దశాబ్దాలుగా అండగా నిలిచిన ఓ నాయకుడిని అతిదారుణంగా చంపితే సీఎం కనీసం మందలించలేదు. బీఆర్ఎస్ పాలనలో అరాచకం చేసిన పోలీసు యంత్రాంగాన్నే మళ్లీ తీసుకొచ్చారు. అసలు వేం నరేందర్‌రెడ్డి ఎవరు..? ఆయన పార్టీకి ఏం చేశారు..? చిన్నారెడ్డి వంటి సీనియర్ నాయకులకు జరిగిన అన్యాయానికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన దిశగా తీసుకొచ్చారు. సీనియర్లను గౌరవించడం లేదు. అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నారు. వేం నరేందర్‌రెడ్డి ప్రభుత్వానికి ఏం సలహాలు ఇచ్చారో చెప్పాలి.

# ఇరాన్‌కు అమెరికా 15 ప్రతిపాదనలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా అణు, క్షిపణి కార్యకలాపాలను కట్టిపెట్టడం, హార్ముజ్‌పై పెత్తనాన్ని వదులుకోవడం, హెజ్బొల్లా వంటి సాయుధ గ్రూపులకు ఆర్థిక, ఆయుధ సాయం నిలిపివేత వంటి షరతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారం కాదని కుండబద్దలు కొట్టింది. హార్ముజ్‌పై తన సార్వాకమాధికారాన్ని గుర్తించాల్సిందేనని డిమాండ్ చేసింది. "మాపై ఇంకెప్పుడూ యుద్ధానికి దిగరాదు. ఆర్థిక తదితర ఆంక్షలను పూర్తిగా ఎత్తేయాలి. మా నేతలు, సైనికాధికారుల హత్యలను మానుకోవాలి"అంటూ అమెరికాకు 8 షరతులు విధించింది! గల్ఫ్ నుంచి అమెరికా బలగాలన్నీ వైదొలగాలని కూడా స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు బుధవారం కూడా తీవ్ర స్థాయిలో కొనసాగాయి. గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులను కొనసాగించింది. అమెరికా కూడా మరో 5,000 మంది మెరైన్లు, 1,000 మంది సైనికులను గల్ఫ్ ప్రాంతానికి తరలిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలను చర్చలకు ఒప్పించేందుకు పలు దేశాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. అమెరికా కాల్పుల విరమణ ప్రతిపాదన పట్ల ఇజ్రాయెల్ విస్మయం వెలిబుచ్చింది. ఇరాన్ పూర్తిగా కాళ్లబేరానికి వచ్చేదాకా దాడులు కొనసాగించాలని అభిప్రాయపడింది. మరోవైపు పశ్చిమాసియాలో కాల్పుల విరమణ యత్నాలకు ఈజిప్ట్, టర్కీ కూడా ముందుకొచ్చాయి. అమెరికా, ఇరాన్ నడుమ చర్చల దిశగా పలు దేశాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఇరుదేశాలు అంగీకరిస్తే వాటి నడుమ ద్వైపాక్షిక చర్చలకు వేదికగా నిలిచేందుకు పాకిస్తాన్ సిద్ధమని ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ పునరుద్ఘాటించారు. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా తన 15 షరతులను పాక్ ద్వారానే ఇరాన్‌కు అందజేసినట్టు న్యూయార్క్ టైమ్స్ వార్తా సంస్థ పేర్కొంది. అయితే వాటిని పూర్తిగా తిరస్కరిస్తున్నట్టు ఇరాన్ ఉన్నతాధికారిని ఉటంకిస్తూ ఆ దేశ ప్రభుత్వ టీవీ చానల్ ప్రకటించింది. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది ఇరానే తప్ప ట్రంప్ కాందంటూ మండిపడింది. అంతేగాక ఇరాన్ కూడా 8 షరతులతో కూడిన తమ ప్రతిపాదనలను వాటన్నింటికీ అంగీకరిస్తేనే యుద్ధానికి తెర దించడంపై నిర్ణయం తీసుకుంటామంటూ కుండబద్దలు కొట్టింది. అమెరికాతో నేరుగా చర్చలు జరగడం లేదని పునరుద్ఘాటించింది. గల్ఫ్, పరిసర దేశాల మంత్రులు తదితరులు తమతో మాట్లాడుతున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పుకొచ్చారు. అమెరికాతో ప్రత్యక్ష చర్చలు మాత్రం అబద్ధమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ అన్నారు. ట్రంప్ మాత్రం చర్చలు కొనసాగుతున్నాయని చెప్పుకొ చ్చారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు జెరేద్ కుష్నర్‌తో పాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా వాటిలో పాల్గొంటున్నట్టు వైట్‌హౌస్‌లో మీడియాకు వెల్లడించారు.

# తెలంగాణలో మరో కొత్త పార్టీ..

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక అంకం మొదలుకాబోతోంది. కల్వకుంట్ల కవిత మార్చి 27న కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు సమాచారం. శ్రీరామనవమి పర్వదినాన ఉదయం 8 గంటలకు ఆమె తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, కవిత తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ ముద్ర వేసుకోవాలని భావిస్తున్నారు. తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపిన ఆమె, ఇప్పుడు నేరుగా కొత్త పార్టీ ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకోవడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉందనే చెప్పాలి. తన మెట్టినిల్లు నుంచే పార్టీ పేరు, జెండా, గుర్తు , విధివిధానాలను ప్రకటించనున్నట్లు సమాచారం. ఇది మహిళా ఓటర్లను.. స్థానిక సెంటిమెంటును ఆకట్టుకునే ప్రయత్నంగా భావించవచ్చు. మార్చి 27న ఆమె తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ప్రకటించనుండటంతో, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లల్లో అలజడి మొదలైంది. తెలంగాణ సమాజంలో తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్న కవిత, ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోబోతున్నారో చూడాలి. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్ , అభివృద్ధి అంశాలను ఆమె కొత్త పార్టీ ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## అసెంబ్లీ సమావేశాల్లో విద్యాహక్కు చట్టం

# అమలుపర్చాలన్న కన్వీనర్ నల్ల లక్ష్మణ్

**విద్యాహక్కు చట్టం ప్రతి వ్యక్తి హక్కు ? గోపి రజక .. ముఖ్యఅతిథిగా హాజరైన టీఆర్ఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక**



**బషీర్ బాగ్,మార్చి 25(ప్రభాత సూర్య):** భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సం.లు గడిచిన విద్యా పేద వర్గాలకు అందటం లేదని గోపి రజక ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బుధవారం బహుజన ప్రజా శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చేమకూర రాజు,విద్యా పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, గౌడ శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నకిరెకంటి శ్రీనివాస్ గౌడ్ , ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెల్లా వెంకటేష్,ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కుర్మయ్య . అనంతరం గోపి రజక మాట్లాడుతూ విద్యాహక్కు చట్టంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి , కొత్త కళాశాలలు, గురుకుల విద్యాలయాలు , డిగ్రీ పీజీ కాలేజీలు మంజూరు చేయాలని, సాంకేతికతతో కూడిన విద్యను అందించాలని, కార్పోరేట్ వ్యవస్థకు దీటుగా విద్యను అందించాలని, కేరళా రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యావ్యవస్థను నడపాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర అక్షరాస్యత 66% ఉండటం చాలా బాధాకరమని అన్నారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని అంటారు కానీ అలా జరగటం లేదని వారు అభిప్రాయపడ్డారు.150 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఇప్పటి వరకు 4 నోబెల్ బహుమతులు పొందటం ఏమిటని ప్రశ్నించారు.ఫీజు రియింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్ లో 25 శాతం విద్యకు కేటాయించాలని కోరారు.కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని కోరారు.

# పెండింగ్ లో ఉన్న 10వేల కోట్ల స్కాలర్షిప్పు, ఫీజు రీయింబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలి....

## నేడు డిగ్రీ,ఇంజినీరింగ్, పీజీ కాలేజీల బందుకు పి.డి.ఎస్.యూ.పిలుపు.....

**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య...:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 10వేల కోట్ల స్కాలర్ షిప్పులు, ఫీజు రియంబర్స్ మెంటు నిధులను వెంటనే విడుదల చేయకపోతే ముఖ్యమంత్రిని రోడ్లపై తిరగనివ్వమని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ఉదయ్ అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పి.డి.ఎస్.యూ. తెలంగాణ రాష్ట్ర కమిటీ మార్చ్ 26న అన్ని డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, ప్రొఫెషనల్ కాలేజీల బందుకు పిలుపునిచ్చింది. ఈ బంద్ కరపత్రాలను ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచిపోయిందని, అధికారంలోకి వస్తే విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేస్తామని ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం రెగ్యులర్గా నిధులను విడుదల చేస్తామని




నమ్మ బలికింది. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆయన దగ్గర నుండి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ల విడుదల చేయడానికి మనసు రావడం లేదని అన్నారు. దాదాపు 10వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. ఈ నిధుల విడుదలకు విద్యార్థులు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల యాజమాన్యాలు దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ కోసం ర్రాణాఖ అనేక ఉద్యమాలు నిర్వహించిందని, జిల్లాల్లో కలెక్టరేట్లను, మంత్రుల ఇండ్లను, హైదరాబాదులో మినిస్టర్ క్వార్టర్ను ముట్టడించి ఉందని, పలు దఫాలు ఛలో అసెంబ్లీ నిర్వహించి కేసులను సైతం ఎదుర్కొంన్నారని తెలిపారు. 2026 జూలై మొదటి వారంలో 72 గంటల పాటు బందు నిర్వహించింది. ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించి నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వానికి చలనం రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తూ విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే రేవంత్ రెడ్డి ని ఎక్కడికక్కడ రోడ్ల మీదకి రాకుండా అడ్డుకుంటామని పి.డి.ఎస్.యు నాయకులు తెలిపారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే బడ్జెట్లో విద్యారంగానికి, స్కాలర్షిప్లకు అధిక నిధులు కేటాయించాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్కు ఇవ్వాల్సిన 218 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తమ్మడి చరణ్, నర్సింహారెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై పిర్యాదులు...

### స్పందించిన జీ.ఎచ్. ఎమ్. సీ. అధికారులు...

**మూడు బిల్డింగులు సీజ్..**




శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : మియాపూర్ డివిజన్ లో బుధవారం రోజు 44 సర్వే నెంబర్ మక్త మహబూబ్ పేట్ లో పర్మిషన్ లేకుండా ఐదు ఫ్లోర్ బిల్డింగ్ లు కడుతున్న వారిపై ప్రజావాణిలో 16 కంప్లైంట్ ఇవ్వగా అందులో 3 బిల్డింగులు జి హెచ్ ఎం సి అధికారులు సీజ్ చేయడాన్ని అభినందిస్తున్నాం ఇంకా 13 బిల్డింగులు కన్స్ట్రక్షన్ లో ఉన్నందున పర్మిషన్ లేకుండా కట్టే బిల్లింగ్ లను తక్షణమే సీజ్ చేయాలని వారిని కోరుతూ హైకోర్టు 44 సర్వే నెంబర్లు పై ట్రిబ్యునల్ బెంచ్ ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని 2016 లో ఆర్డర్ ఉన్నప్పటికీ అక్రమ దారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఐదు ఫ్లోర్లు ఆరు ఫ్లోర్లు 100 గజాల్లో ఏడు ఫ్లోర్లు కూడా నిర్మిస్తూ నాణ్యత లేని బిల్డింగులు కడుతూ తక్కువ ధరకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారు కాబట్టి కన్స్ట్రక్షన్ లో ఉన్న మిగతా బిల్డింగులు కూడా సీజ్ చేయవలసిందిగా కోరుతూ తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తెలియజేశారు.



## వ్యాలీడేషన్ చట్టం రద్దు చేయాలి: పన్నాల గోపాల్ రెడ్డి



**ఖమ్మం ( ప్రభాత సూర్య ప్రతినిధి ):** పెన్షనర్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పార్లమెంటు ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పన్నాల గోపాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ పిలుపు మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నేడు జరిగిన ధర్నా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. గత సంవత్సరం మార్చి 25 తేదీన కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా వ్యాలిడేషన్ చట్టాన్ని ఆమోదించుకుంది ఇటువంటి చీకటి ఉత్తర్వులు తీసుకురావడం దుర్మార్గం అన్నారు.2004 లో పాత పెన్షన్ పథకం స్థానంలో కొత్త పెన్షన్ పద్ధతి సిపిఎస్ ప్రవేశపెట్టి పదవి విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే పెన్షన్కు ఎసరు పెట్టే ప్రయత్నం చేసింది. కేంద్ర ప్రభుత్వం మరోసారి పెన్షనర్లపై కొరడా దులిపించింది దేశవ్యాప్తంగా పెన్షనర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఒక ప్రభుత్వ సాధికారిక ప్రకటనను 2025 మార్చి చివరి వారంలో భారత పార్లమెంటు ఆమోదించింది.ముందస్తు సమాచారము ఇవ్వకుండా బిల్లులో చేర్చి అకస్మాత్తుగా మార్చి నెల 25వ తేదీ నాడు లోకసభలో ప్రవేశపెట్టి బిల్లు ఆమోదం పొంది చట్ట రూపము దాల్చింది. ఈ చట్ట ప్రకారము కేంద్ర ప్రభుత్వము 01-01-2026 కు ముందు రిటైర్ అయిన పెన్షనర్లు 01-01-2026 తరువాత రిటైర్ అయ్యే పెన్షనర్లు అని రెండు వర్గాలుగా పెన్షనర్లను విభజించి 01-01-2026 ముందు పదవి విరమణ పొందిన వారికి రాయితీలు పి ఆర్ సి డి ఏ లు ఉండవని చెప్పడం దారుణం దీనిని తిప్పి కొట్టేందుకు కేంద్ర రాష్ట్ర స్థాయిలో ఐక్య ఉద్యమాలు చేసేందుకు అందరము ఏకం కావాలి అన్నారు.ఎమ్మెల్యే ఎంపీలుగా ఎంపిక య్యే ప్రజా ప్రతినిధులకు పూర్తిస్థాయిలో ఎన్నిసార్లు పదవి చేస్తే అన్ని సార్లు పెన్షన్ పొందే సౌకర్యం ఉన్నప్పుడు 35 /40 సంవత్సరకాలం పాటు సుదీర్ఘంగా ప్రభుత్వానికి సేవ చేసే ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఇచ్చేం దుకు పాలకులు వెనుకాడుతున్నా రన్నారు. డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన పెన్షనర్లకు వారికి రావలసిన బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేసినారు పెండింగ్లో ఉన్న నాలుగు డిఏ లను వెంటనే ప్రకటించాలని కోరినారు. వెలివేషన్ యాక్టివ్ ప్రజలను నిరసనగా చించి వేయడం జరిగింది. అనంతరం నల్గొండ జిల్లా కలెక్టర్ కి విజ్ఞాపన పత్రం సమర్పించారు ఈ కార్యక్రమం లో వివిధ పెన్షన్ సంఘాల బాధ్యులు శ్యాంసుందర్ బిక్షపతి లక్ష్మారెడ్డి ప్రభాకర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## రామప్రభు ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం...

మియాపూర్ ప్రభాత సూర్య : మియాపూర్ 240 డివిజన్లో స్థానిక నాయకుడు అట్టేపల్లి రామప్రభు మియాపూర్ ప్రజల ఆరోగ్యరీత్యా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ను బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్థానిక ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సాయం త్వరితగతిన అందాలనే ఉద్దేశంతో ఈ అంబులెన్స్ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ఏర్పాట్లు చేసిన రామప్రభును ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ మాజీ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు శేర్లింగంపల్లి కాంగ్రెస్ కోఆర్డినేటర్ రఘునాథ్ రెడ్డి అట్టేపల్లి పురుషోత్తం శర్మ సమ్మెట ప్రసాద్ డాక్టర్ రవికుమార్ చౌదరి నరసింహారెడ్డి రాజేంద్రప్రసాద్ స్వామి ఆంజనేయులు ప్రసాద్ నాయుడు ఏ ఆర్ పి టీం సభ్యులు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గ్యాస్ సిలిండర్ల పట్టివేత....

**గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచిన, బ్లాక్ లో విక్రయించిన కఠిన చర్యలు....**

**మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్.....**



మాదాపూర్ ప్రభాత సూర్య : మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్రిక నగర్ లో అక్రమంగా తరలిస్తున్న 31 సిలిండర్ల వ్యాన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా సిలిండర్లను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా 31 సిలిండర్లతో కూడిన ఒక వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నాము. వ్యాన్ డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి అరెస్టు చేశామని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాలుపడితే కఠినమైన చర్యలు ఉంటాయనితెలిపారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్లో విక్రయించే ప్రయత్నం ఎవరు చేసిన వెంటనే పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

## నేతాజీ నగర్ కాలనీలో దోమల నివారణకు జి హెచ్ ఎం సి సిబ్బంది చర్యలు ..

**కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్..**

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : నేతాజీ నగర్ కాలనీలో దోమలు, క్రిమికీటకాల నివారణకై జిహెచ్ఎంసి సిబ్బంది, ఎంటమాలజీ సహకారంతో కాలనీలో చర్యలు చేపట్టడం జరిగింది.నేతాజీ నగర్ కాలనీలో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ కాలనీలోని ప్రజ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కలిగించారు మన పరిసరాలు మన శుభ్రంగా ఉంచుకోవాలి మురుగునీరు కానీ చెత్త చెదారం ఎక్కడబడితే అక్కడ బయట పారేయకుండా చెత్త జిహెచ్ఎంసి చెత్తబండికే ఇవ్వాలని ప్రజలకు అవగాహన కలిగించారు. చెత్త మనం బయట ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల దోమలు ఈగలు విపరీతంగా ప్రభలుతాయి. దోమ కాటు వల్ల మలేరియా డెంగు విష జ్వరాలు ప్రబలుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించారు.





## డ్రైనేజీ సమస్యను పరిష్కరించినసర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 25(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో 3వ వార్డ్ లో నిలిచిన మురికి కాలువ పనులు ప్రారంభించి శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిన గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ సర్పంచ్ గా గెలిచిన తర్వాత గ్రామంలో ప్రధాన సమస్య కోతుల , కుక్కల బెడద నివారించాశీ. గత కొన్ని సంవత్సరాలుగా నారాయణపురం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ వస్తున్నామని అన్నారు. అలాగే అక్కడక్కడ మళ్ళీ రెండు మూడు కోతులు, కుక్కలు గ్రామ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు వాటిని కూడా నివారిస్తామని అన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నిలుపుతానని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్లు సింగం బిక్షపతి, చిలువేరు రమాదేవి శంకర్ , గ్రామ కార్యదర్శి సిహెచ్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు,కారోబర్ పున్నం యాదగిరి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డిజిల్ కొరతను నివారించాలి



**మిర్యాలగూడ మార్చి 25:-( ప్రభాత సూర్య) :** పెట్రోల్, డీజిల్ కొరత లేకుంటే బంకుల యాజమాన్యం నో స్టాక్ అంటూ ఎందుకు మూసుకున్నారని బిఆర్ఎస్ నాయకులు తిరందాసు విష్ణు ప్రశ్నించారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ పెట్రోల్ కొరత కారణంగా సగం బంకులు నో స్టాక్ బోర్డు పెట్టి ఉన్నాయి. సగం బంకుల వద్ద విపరీతమైన రద్దీ నెలకొందని ఆయన అన్నారు.తక్షణమే పౌర సరఫరాల శాఖ స్పందించి అన్ని బంకుల్లో పెట్రోలు, డిజీల్ కొరత లేకుండా చూడాలన్నారు. పెట్రోల్ కొరత వల్ల మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెట్రోల్ కొరతను నివారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## చేనేత కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ కలిసిన పద్మశాలి సంఘం నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 25(ప్రభాత సూర్య ):** తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం చేనేత కార్మికులు ఎమ్మెల్సీ ఎల్ రమణ నీ కలిసి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వినిపించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల సంఘం అధ్యక్షులు సురపల్లి జనార్ధన్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు విడం సాయి కిషోర్ నేత,చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చెరిపెల్లి లక్ష్మయ్య గంజి రాములు,దోర్నాల అంజయ్య,గంజి వేణు,సింగం కృష్ణ,గర్దాస్ రాఘవేంద్ర,సింగం భాస్కర్, సంగిశెట్టి నరేష్,తదితరులు పాల్గొన్నారు

## కొత్తగూడెంలో సిసి రోడ్ల పనులు ప్రారంభించిన: సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 25(ప్రభాత సూర్య):** ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఉపాధి హామీ విధులలో నుండి సంస్థాన్ నారాయణపురం మండల కొత్తగూడెం గ్రామం లో ఇరవై లక్షల రూపాయలతో జెడ్పీ రోడ్ నుండి బాలగోని భూపాల్ ఇంటి ముందు వరకు సీసీ రోడ్ నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య ఉప సర్పంచ్ రాచకొండ సాలమ్మ, వార్డు సభ్యులు గుర్రం రమేష్, బాలగోనీ మల్లేష్,నీళ్ల అరుణ, రొమ్ముల సత్యం, గణం శివశంకర్,రాచకొండ మనమ్మ, సుర్కంటి జనార్దన్ రెడ్డి, గ్రామ పెద్దలు సిరిపంగి బుచ్చయ్య, బాలగోని భూపాల్, బాలగోని మల్లేష్,రాచకొండ జంగయ్య, కోడూరు నరసింహ,కొండూరు బిక్షం,రాచకొండ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు



# అడ్డదిడ్డంగా పార్కింగ్ ...



### వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు...
### పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు.....
### ఒక్కోబండికి రోజుకు అద్దె...

**మాదాపూర్ ప్రభాత సూర్య :** ఫుట్పార్తై తోపుడు బండ్లు మోటారు వాహనాలపై బార్యానీలు, అల్పాహారం అమ్మేవారి వలన మాదాపూర్ ఐటీసీ కోహినూర్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సుమారు 100 వాహనాలద్వారా తినుబండారులు అమ్మకాలు ఆసిస్తున్నారు. వారి వ్యాపారానికి ఒక సమయం అంటూ ఏమీ లేదు. అర్ధరాత్రి ఫుట్పాత్ వ్యాపారులవద్ద బిర్యానీలు తినడానికి వచ్చిన వారు అక్కడే మద్యంతాగి ఇతరుల పై మర్షణలకు దిగుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రామదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో తోపుడు బండ్లతో ఫుడ్ వ్యాపారం జోరుగా సాగుతుంది. అయితే ఇక్కడ వ్యాపారాలు చేసేవారంతా స్థానికులు కాదు. బంజారాహిల్స్, ఆసిఫ్ నగర్, మాదాపూర్, అమర్పేట్ ప్రాంతాలను నుంచి ఇక్కడు వచ్చి బండ్లను వ్యాపారులకు రోజుకు కొంత డబ్బు చొప్పున అద్దెకు ఇస్తుంటారు. దానికి అదనంగా బండికి అడ్వాన్స్ తీసుకుంటారు. వేరువారు అక్కడ వ్యాపారం చేయాలంటే వారి అనుమతి తప్పని సరిగా ఉండాలి. లేకుంటే దాడులు చేస్తారని అక్కడ కొంత మంది వ్యక్తులు చెబుతున్నారు.

**పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు.........**

రాత్రివేళ ఫుడ్ కోసం తోపుడు బండ్ల వద్దకు వచ్చేవారితో అప్రాంతమంతా కారులు, ద్వితీయ చక్రాల వాహనాలతో కిక్కిరి పోతున్నాయి. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. పోలీసులకు మామూళ్లు ముట్టబట్టే ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నా ..పట్టించు కోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి వరకు ఫుడ్ అమ్మకాలు సాగిస్తూ ఘర్షణలకు కారణమౌతున్న తోపుడు బండ్లను అక్కడ నుంచి తొలగించాలని పలువురు అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

## ప్రతి ఏటా ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు : చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి

**మునుగోడు, మార్చి 25(ప్రభాత సూర్య) :** మునుగోడు మండల కేంద్రంలోని ప్రాచీన శివరామ ఆలయంలో ఆలయ చైర్మన్ పాల్వయి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో బుదవారం రోజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు..ఆలయంలో 2020 సంవత్సరం నుండి 2026 సంవత్సరం వరకు నిర్వహించిన ఉత్సవాలకు సంబంధించిన ఆదాయ వ్యయములను మీడియాకు చైర్మన్ వివరించారు.. కులాలకు అతీతంగా ఆలయంలో జరిగే కార్యక్రమాలకు గ్రామస్తులు క్రమశిక్షణతో ముందుకు వచ్చి , రాజకీయ విద్వేషాలకు పాటుపడకుండా, సామరస్యాన్ని చాటుతూ ఆలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.. కొందరు వ్యక్తులు మేము ఆదాయ వ్యయములు చూపడానికి సమావేశం ఏర్పాటు చేయగా గందరగోళం సృష్టించి,అభివృద్ధికి సహకరించిన వారిపై ఇష్టారీతిగా మాట్లాడుతూ అపనిందలు వేయడంతో చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు...ప్రతి ఒక్కరు అబివృద్ధి చేసేవారికి సంహరించడం మన పద్ధతి అని గుర్తుకు



తెచ్చారు..57 వేల 208 రూపాయలను ఏపిజీవిబి బ్యాంక్ లో జమ చేయడం జరిగినది అని తెలిపారు.ఆలయ కమిటీ రాజీనామా పత్రాన్ని సర్పంచ్ కు రాతపూర్వకంగా అందజేశారు. ఈ సమావేశంలో మాజీ చైర్మెన్ పాల్వాయి యాదగిరిరెడ్డి , యడవెల్లి సురేష్ కుమార్, పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,కంచర్ల వెంకన్న,మునుగోటి యాదయ్య,సింగం గిరి,రెవెల్లి సైదులు, కళ్యాణ్ కార్ మల్లాజీ,, దొమ్మాటి వెంకన్న, శ్రీరామోజీ శ్రీను,ఎం నరసింహ, ధోమ్మాటి శంకరయ్య,సైదులు,శంకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

**మిర్యాలగూడ, మార్చి 25:-( ప్రభాత సూర్య) :** అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని మిర్యాలగూడ మండల ఓటర్ నమోదు అధికారి తహసీల్దార్ పి. శ్రీనివాస్ కోరారు. మిర్యాలగూడ ఓటర్ నమోదు అధికారి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ మండలం, మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ల నమోదు మార్పులు, చేర్పులు, ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) తదితర విషయాలపై బూత్ లెవెల్ ఆఫీసర్స్, బూత్ లెవెల్ సూపర్వైజర్స్ కు శిక్షణ కార్యక్రమం మిర్యాలగూడ రైతు వేదికలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అధికరణ 324, 325, 326 ప్రకారం ఎన్నికల సంఘ నియమావళి అనుసరించి ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ఆధారంగా ప్రతి ఓటర్ పూర్తి వివరాలను నమోదు చేయాలని 1987కు ముందు ఓటరుగా నమోదు అయిన వ్యక్తులకు ఎటువంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని 1987 నుండి 2004 మధ్యలో ఓటర్గా నమోదు కావాలన్నప్పుడు తల్లి లేదా తండ్రి ఏదేని ఆధార పత్రాన్ని జతపరచాలని 2004 తర్వాత ఓటరుగా నమోదు అయిన వారు తల్లి, తండ్రి యొక్క ఆధార్ పత్రాలను జత చేయాలని ఈ విషయాలను తెలియజేయడం కోసం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి బిఎల్ఓలకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, ప్రతి బిఎల్ఓ వారి ప్రాంతంలో ఉన్న అన్ని విషయాలపై సమగ్ర అవగాహనతో ఫామ్ 6, 7, 8లకు సంబంధించిన ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరచుకొని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని, పరిపూర్ణ ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆర్.ప్రవీణ్ కుమార్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య, అంబటి శ్రీను, ఆర్ఐ టీ.రామకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదుపై శిక్షణలో తహసీల్దార్ శ్రీనివాస్



## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తొలి సమావేశం

### సమస్యల పరిష్కారంపై దృష్టి మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం.
### దుకాణదారులతో చర్చలు, క్రమశిక్షణతో వ్యాపారం చేయాలని సూచనలు

**పటాన్చెరు , మార్చి 25,ప్రభాత సూర్య :** మండలం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం ఆధ్వర్యంలో మార్కెట్ సమస్యల పరిష్కారానికి తొలి సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్‌లోని దుకాణదారులతో ప్రత్యక్షంగా చర్చించి, వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుకాణదారులు తమ వ్యాపారాలను క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని సూచించారు. కాలపరిమితి ముగిసిన అనుమతిపత్రాలను వెంటనే పునరుద్ధరించుకోవాలని తెలియజేశారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. మార్కెట్ యార్డ్‌లో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తెలియజేయాలని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మార్కెట్ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.



# సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్.డీ



**పటాన్చెరు, మార్చి 25,ప్రభాత సూర్య :** మండల లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాస–ఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాస–ఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు. స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్టక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు. డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తిపరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.

### పెట్రోలు బంకుల్లో కృత్రిమ కొరత

## సృష్టిస్తే చర్యలు తప్పవు..

### హత్నూర హతసిల్దార్ పర్వీన్ షేక్

**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చ్25:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ లో బుధవారం హత్నూర తహసిల్దార్ పర్వీన్ షేక్ భారత్ పెట్రోల్ పంపు,ఇండియన్ ఆయిల్ పంపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పెట్రోలు బంకుల్లో నిల్వల గురించి అడిగి డీజిల్,పెట్రోలు ను ఎందుకు నిల్వలు ఉంచడంలేదు స్టాకు లేదు అంటూ బోర్డు ఎందుకు పెట్టారని పెట్రోలు బంకు యజమాని మల్లయ్యా పై తహసీల్దార్ పర్వీన్ షేక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పెట్రోలు బంకుల్లో నిల్వలేదంటూ కృత్రిమ కొరతలు సృష్టిస్తే ఊరుకునేది లేదని,ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కావున పెట్రోలు బంకుల్లో ఎప్పటిలాగే పెట్రోలు స్టాకు ఉంచాలని సూచించారు.



## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్




**మిర్యాలగూడ, మార్చి 25:-( ప్రభాత సూర్య):** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్ డిమాండ్ చేశారు. మార్చి 25న ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనీయకుండా మిర్యాలగూడ రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20% కేటాయింపు చేయాలన్నారు. అన్ని గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, కళాశాలలకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్ర యూనివర్సిటీలలో ఎన్ఇజూ –2020 అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర యూనివర్సిటీలలో ఖాళీ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వసతిగృహ విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం 218 కింద రూపాయల బకాయిలు విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం - 2020 అమలు కాకుండా అసెం బ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఖమ్మం, ఆదిలా బాద్ జిల్లా కేంద్రంగా జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. అరెస్టయిన వారిలో బన్నీ, గోపి, రెహన్, ఇర్ఫాన్, గణేష్, నాయకులు ఉన్నారు.



## ఎస్ పి టి మార్కెట్ ఎదురుగా ప్లే బాయ్ షాప్ ను ప్రారంభించిన కంచర్ల భూపాల్ రెడ్డి

**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణ కేంద్రంలో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎస్ పి టి మార్కెట్ ఎదురుగా బుధవారం మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, షాప్ నిర్వాహకులు గాలి మురళి లు ప్రారంభించి మాట్లాడారు. ప్లే బాయ్ షాపు వివిధ రకాల బ్రాండ్ గల షర్ట్స్ టీషర్ట్స్, పాంట్స్, మరియు ఫుట్వేర్ లభించునని కస్టమర్లకు నాణ్యత గల వస్త్రాలు కస్టమర్ల మందనలు పొందాలని తెలిపారు. ప్లే బాయ్ షాపును సందర్శించి కొనుగోలు చేయగలరని పట్టణ గ్రామీణ ప్రజలకు సూచించారు. అదేవిధంగా యువతీ యువకులు వ్యాపార రంగాలలో రాణించాలని కోరారు. షాప్ ఏర్పాటుచేసిన మురళిని అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పేర్ల అశోక్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, దండంపల్లి సత్తయ్య, మేడి ప్రమోద్, బిల్లా, కత్తుల చందన్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్





**పెగడపల్లి మార్చి 25 (ప్రభాత సూర్య):** కేరళలో శబరిమల్లె పుణ్యక్షేత్రంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్– స్నేహలత దంపతులు మరియు మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు దంపతులు అయ్యప్ప స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు,.

## బడ్జెట్లో ఎస్సీ వర్గాలకు తీవ్ర అన్యాయం




**మిర్యాలగూడ మార్చి 25:- (ప్రభాత సూర్య):** కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ వర్గాలపై తీవ్ర అన్యాయం జరిగిందని మిర్యాలగూడ నియోజకవర్గ ఎస్సీ నాయకులు బైరం సంపత్, దైదా సత్యం, జానయ్య, ఎరమళ్ల దినేష్, ఎం.అంజిబాబు, తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయించాల్సిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బడ్జెట్లో సరైన ప్రాధాన్యం ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు.ప్రత్యేకంగా ఎస్సీ సబ్ప్లాన్ నిధులను సక్రమంగా కేటాయించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోతుందన్నారు. విద్య, ఉపాధి, గృహాలు, స్వయం ఉపాధి పథకాలలో ఎస్సీ వర్గాలకు ఎలాంటి స్పష్టమైన హామీలు లేకపోవడం చాలా బాధాకరమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తప్పును సరిదిద్దుకొని, ఎస్సీ వర్గాలకు న్యాయం చేసే విధంగా నిధులను పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.సమావేశంలో ధనమ్మ, ఉమా, వినోద్, పెరుమాళ్ళ శ్రీను, చంటి, శేఖర్, వెంకటేష్,, శంకర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయతి అధికారి ని సన్మానించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 25(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించిన సంస్థాన్ నారాయణ పురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంపీఓ నర్సింహా రావు, నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొంతం వెంకటేశ్వర్ ప్రసాద్ గౌడ్...





**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో జూనియర్ సివిల్ జడ్జి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ నూతన బార్ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొంతం వెంకటేశ్వర్ ప్రసాద్ గౌడ్, ఉపాధ్యక్షుడు రావుల రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి తోటకూర రాజు, సహకార దర్శి సూపరి సంపత్ కుమార్, పారునంది రవికుమార్, ఎంపికయ్యారు. స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి సామల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మొరిగాడి కృష్ణ, పూల గురుమూర్తి ,లోకేశ్వరి, సంగీత పల్వార్, అనిపా, మొబైన్,సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు న్యాయవాదులు అభినందలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం వెంకటేశ్వర్ ప్రసాద్ గౌడు బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులకు ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు .న్యాయవాదుల వారిసమస్యలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని తెలిపారు. ఇరువురు న్యాయవాదులు శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జూకంటి, రవీందర్, సీసా శ్రీనివాస్ గౌడ్, భీమగాని శ్రీనివాస్, వన్నమరాజు, వంగరి శివకుమార్,తుంగ హరికృష్ణ, కల్లూరి సిద్ధులు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సంసాద్ ఖేలో ఇండియా మహోత్సవ గేమ్స్ భాగంగా గిఫ్ట్ మనీ అవార్డు అందజేత......




**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య :** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున బిజెపి పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన గేమ్స్ కార్యక్రమం ( పీఎం సంసద్ ఖేలో ఇండియా) మహోత్సవ గేమ్స్ లో భాగంగా గెలుపొందిన క్రీడాకారులందరికి గిఫ్ట్ మనీ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దెయ్యాల కుమార్, కో కన్వీనర్ ప్రవీణ్ కుమార్, టౌన్ కన్వీనర్ మైదం భాస్కర్, కో కన్వీనర్ పేరప్ ఆనంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయులు తోట రంగయ్య, మరియు ఆర్ పి ఆర్ పి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వెంకటమ్మ .మైనారిటీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కవిత, పిఈటి నిర్మల, సిరి , పూల నాగయ్య, బిజెపి జిల్లా కార్యదర్శి కమిటీకారి కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్, కౌన్సిల్ మెంబర్ వడ్డమాని నరేందర్, జిల్లా నాయకులు తునికి దశరథ, సముద్రాల శ్రీనివాస్, మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్,బూత్ అధ్యక్షులు గుర్రం నరసింహులు, రచ్చ రాము, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు,

## ఖమ్మంలో ఫ్రెండ్స్ ఈవి ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభం

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగరం చర్చి కాంపౌండ్ సమీపంలోని సుగుణ హాస్పిటల్ పక్కన అమిటీ ఇండియా నెట్వర్కింగ్ మార్కెట్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఇవి ఎలక్ట్రికల్ బైక్ షోరూం నిన్న ప్రారంభించారు.అమిటీ ఇండియా ప్రతినిధి ప్రవీణ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు జి జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# 6వ వార్డును అభివృద్ధిలో దిశలో ఉండేలా కృషి చేస్తాం మున్సిపాల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్....





**ఆలేరు, మార్చి 25, ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బహదూర్‌పేటను అభివృద్ధి దిశలోకి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ తెలిపారు. బుధవారం రోజున నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి 6వ వార్డులోని పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం, శానిటేషన్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం పులి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, వార్డు అధ్యక్షులు వట్టిపల్లి శ్రీనివాస్, కుళ్ళ సిద్దులు, వట్టిపల్లి సిద్ధిరాజు, లక్ష్మణ్, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు ఉతా పవన్, పర్శ నరేష్, కుళ్ళ జహంగీర్, ఎండీ సలీం, ముదికొండ శ్రీకాంత్, దూడల రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



## వాలిడేషన్ యాక్ట్ -2025 ను వెంటనే రద్దు చేయాలని సబ్ కలెక్టర్కు వినతి పత్రం

**మిర్యాలగూడ మార్చి 25:- (ప్రభాత సూర్య):** ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులకు గొడ్డలి పెట్టయిన వాలిడేషన్ యాక్ట్ -2025 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మిర్యాలగూడ శాఖ ఆధ్వర్యంలో నల్లబాడ్జిలు ధరించి బుధవారం అసోసియేషన్ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ స్థానిక సబ్ కలెక్టరేట్ వరకు నిర్వహించి ధర్నా చేసి సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షుడు హేమసుందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బి.శేషు, సిహెచ్.గోపయ్య ఉపాధ్యక్షుడు పీడీ ఏడ్విన్ మాట్లాడుతూ నూతన చట్టం వల్ల పెన్షనర్లకు భారీ నష్టమని ఎలాంటి లబ్ది చేకూరదని అన్నారు. పెన్షన్ అనేది సామాజిక భద్రత అని, ఇదే విషయం న్యాయస్థానం కూడ పేర్కొన్నదని దీనికి భిన్నంగా చట్టం ఉన్నదన్నారు. వెంటనే చట్టం రద్దు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కోశాధికారి ఎల్. రమేష్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎస్.వెంకట్ రెడ్డి, బి. కృష్ణారెడ్డి, ఏడుకొండలు, జానకిరాములు, ఎ. సత్యనారాయరెడ్డి, యాదగిరిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు కె.సత్యనారాయణ, ఎండి.యూసుఫ్ లు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో విద్యా రంగానికి తీవ్రమైన అన్యాయం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్

### బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్




**నల్గొండ ప్రభాత సూర్య :** బిఆర్ఎస్వి పిలుపు మేరకు మంగళవారం అసెంబ్లీని ముట్టడించారు. అనంతరం అసెంబ్లీ దగ్గర అరెస్ట్ చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. అక్రమ అరెస్టులకు ని ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 10000 వేల కోట్లు ఉంటే బడ్జెట్ లో 4 వేల కోట్లే కేటాయింపులు చేసి విద్యార్థులను, కళాశాల యాజమాన్యాలను మోసం చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ 10 వేల కోట్ల బకాయిల ప్రస్తావన బడ్జెట్ కేటాయింపులో లేవు ఈ బడ్జెట్లో పెరిగిన ధరలకు అనుగుణనంగా వివిధ కోర్సుల ఫీజులు పెంచుకునే అవకాశం కాలేజీ యాజమాన్యాలకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్స్ పెంచాలనే ఆలోచన లేకపోవటం విద్యార్థి వ్యతిరేకతకు నిదర్శనం విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు, విద్యార్థినిలకు స్కూటీలు 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాల్సిందిగా డిమాండ్ చేసారు. సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తా అని మోసం. ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా మోసం.జాబ్ క్యాలెండర్ మోసం.విద్యా రంగానికి 15% బడ్జెట్ కేటాయిస్తాం అని మోసం. ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యాభరోసా కార్డు అమలు కాలేదు గురుకులాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండగా, కలుషిత ఆహారం తినడం వలన రాష్ట్రంలో ఇప్పటికి 126 మంది విద్యార్థులు చనిపోవడం జరిగింది ఈ మరణాలకు బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ ఎస్సి, ఎస్టి విద్యార్థులు 10 వ తరగతి పాస్ అయితే 10000, ఇంటర్ పాస్ అయితే పదిహేను వేలు, డిగ్రీ పాసైతే 25000, పిజి పాస్ అయితే లక్ష, పిహెచ్డి పాస్ అయితే ఐదు లక్షలు ఇస్తా మోసం6 గ్యారంటీ లకు పంగనామాలు పెట్టిన నయవంచన 420 రేవంత్ రెడ్డి సర్కార్.ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు దీ=ూ౦ ఉద్యమం ఆగదు అని విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటాం అని హెచ్చరిస్తూ డిమాండ్ చేసారు.

## రాష్ట్రంలో గొర్రెల మేకల పెంపకదారుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రివర్యులు హరీష్ రావుకు వినతిపత్రం సమర్పించిన గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం..



ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య: ఆలేరు మున్సిపాలిటీలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జల్లి నరసింహులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని గొర్రెల, మేకల పెంపకదారుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు టి. హరీష్ రావుకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. రాష్ట్రంలో గొర్రెల, మేకల, పెంపకం వృత్తిని జీవనాధారంగా చేసుకొని వేలాది కుటుంబాలు జీవిస్తున్నారని అన్నారు. గొర్రెల, మేకల పెంపకదారుల సమస్యలు పట్టించుకోకపోవడంతో ఈ వృత్తి అంతరించిపోయే ప్రమాదం ఉందని అన్నారు. కావున రాష్ట్రంలో గొర్రెల, మేకల పెంపకదారులకు సహకార సంఘం ద్వారా 2017 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ సి డి సి కార్పొరేషన్ ద్వారా మార్ట్ గెజ్ చేసుకొని గొర్రెలకు, మేకలకు కొనుగోలు రుణాలు ఇచ్చారని, పకృతి వైపరీత్యాల కారణంగా రుణాలు చెల్లించలేకపోవడంతో ఎన్ సి డి సి వారు అధిక వడ్డీలతో రుణాలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇట్టి రుణాలను మాఫీ చేయాలని కోరారు. అలాగే గొర్రెలకు ,మేకలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. పిడుగుపాటు ప్రకృతి వైపరీత్యాల వలన పెంపక దారులు మరియు గొర్రెలు, మేకలు చనిపోతే వృత్తిదారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు.

## పట్టణాభివృద్ధికి ఆస్తుపన్నులే ఆధారం, ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం



**మిర్యాలగూడ, మార్చి 25:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడలో ఆస్తి పన్ను వసూళ్లపై కఠిన చర్యలు పట్టణ అభివృద్ధికి పన్నులే ఆధారం మిర్యాలగూడ పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయడానికి మున్సిపల్ కఠిన చర్యలు చేపడుతున్నామని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆస్తిపన్ను వసూళ్లలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో అద్దె చెల్లించని షాపులను సీలు వేసినట్టు ఆయన తెలిపారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అన్ని వార్డుల్లో ఇంటింటి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసిన ఇంకా పన్నులు చెల్లించని డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బకాయిలు వెంటనే చెల్లించని పక్షంలో జరిమానాలు, చట్టపర చర్యలు తప్పవన్నారు.పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పూర్తిగా ఆస్తి పన్నులపై ఆధారపడి ఉంటాయన్నారు. అందువల్ల ప్రతి పౌరుడు తన బాధ్యతగా పన్నులు సమయానికి చెల్లించడం అత్యంత అవసరమన్నారు.పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సహకరించి తమ ఆస్తి పన్నులను వెంటనే చెల్లించి అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమం లో మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.






## వారం రోజుల్లో ఆస్తి పన్నుల చెల్లించాలి లేదంటే జప్తి... మున్సిపల్ కమిషనర్..



**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య :** మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరం గాను ఆస్తి పన్నులు వసుళ్ళలో భాగంగా గత సంవత్సరం మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం,బకాయి అస్థి పన్ను చెల్లించని వారికి వారంలో చెల్లించవలసినదిగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలియజేస్తూ రెడ్ నోటీసు ఇవ్వడం జరిగింది. తదుపరి కూడా పన్ను చెల్లించని వారి యొక్క ఆస్తులను ఆలేరు మున్సిపాలిటీ సిబ్బంది సీజ్ (జప్తు) చేయడం జరుతుందని తెలిపారు. కొంతమం దికి ఇచ్చిన గడువు ముగిసినందున బుధవారం రోజున ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పలు బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆలేరు పట్టణ ప్రజలందరూ ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.ఇ .వెంకటేష్, ఇంచార్జ్ ఎస్, ఐ, ఎస్. స్వామి ,బిల్ కలెక్టర్ బాబు, నాగేందర్, వార్డ్ ఆఫీసర్ పవన్ కళ్యాణ్, మున్సిపల్ సిబ్బంది ఏలియా,సుదీర్, లింగయ్య, అన్వర్,అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సన్ మెర్జెస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభించిన తుమ్మల యుగంధర్

**ఖమ్మం (ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగరం మమత హాస్పిటల్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సన్ మెర్జెస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిర్వాహకులు మేనేజింగ్ డైరెక్టర్ మద్ది ప్రభాకర్ రెడ్డి ని యుగంధర్ అభినందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంత లక్ష్మి విద్యావేత్త షైన్ ఇండియా స్కూల్ చైర్మన్ తాళ్లూరి సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మాలి రంగారెడ్డి కుటుంబానికి 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి

**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య:** ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో ఇటీవల చనిపోయిన మాలి రంగారెడ్డి వారి కుటుంబాన్ని రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి పరామర్శించిన అనంతరం వారి కుటుంబానికి 50 నిస్త్ర ల బీయ్యం సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కొల్లూరు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీపాల్ రెడ్డి, కొల్లూరు సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య , ఉప సర్పంచ్ గాజుల దశరథ, ఆలేరు మండల అధ్యక్షురాలు గ్యాదపాక దీప,వార్డ్ మెంబర్ అచ్చినీ బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాత్రి లక్ష్మయ్య, మరియు గ్యాదపాక మల్లేష్, తెడ్డు ఆంజనేయులు. యూత్ కాంగ్రెస్ నాయకులు గాజుల కరుణాకర్ లు కాంగ్రెస్ కొల్లూరు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర రాష్ట్ర పాలకుల డబ్బాలే తప్ప

**మిర్యాలగూడ, మార్చి 25:- (ప్రభాత సూర్య) :** పెట్రోల్ కొరత లేదని కేంద్ర, రాష్ట్ర పాలకులు డబ్బా కొట్టుకుంటున్న కొరతకు బంకుల నిర్వహణ తీరు నిదర్శనంగా ఉంది. మిర్యాలగూడ పట్టణం, మండలాల్లో సగం బంకులను మూసి వేసి నో స్టాక్ బోర్డు పెట్టి ఉన్నాయి. ప్రభుత్వ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంకును మూసి ఉంచడం తెరచి ఉన్న కొన్ని బంకుల వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీల విపరీతమైన రద్దీ నెలకొంది. అదేవిధంగా సాధారణ రోజుల్లోనే క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్ పోయని బంకుల సిబ్బంది పోస్తున్నారు. అధికారులు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. తక్షణమే పౌర సంబంధాల శాఖ స్పందించి అన్ని బంకుల్లో పెట్రోలు కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పెట్రోల్ కొరత వల్ల మధ్యతరగతి ప్రజలు చాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెట్రోల్ కొరతను నివారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలనిప్రజలు కోరారు.




## ప్రతి ఒక్కరూ చిన్నారులకు టీకాలు తప్పకుండా వేయించాలి





**పెబ్బేరు మార్చి25 ప్రభాత సూర్య:** చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించేలా చూసే బాధ్యత వైద్యసిబ్బందిపై ఎంతైనా ఉన్నదని జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గీతాదేవి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ యశోద అన్నారు. బుధవారం పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుధవారం వ్యాక్సిన్ వేసుకునే వారి డ్యూలిస్టలను ఆశా కార్యకర్తల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకా వేయగానే పిల్లల తల్లిదండ్రులకు నాలుగు మెసేజ్‌లు తెలుపాలన్నారు. జ్వరం రాకుండా సిరప్ మందు ఇవ్వాలని సూచించారు. అలాగే మందుల స్టాక్ రిజిస్టర్‌ను మెయింటేన్ చేయాలన్నారు. ప్రతీ ఒక్క సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించాలని సూచించారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఎండల అధికంగా ఉండడం వల్ల ప్రజలు ఎండల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఆశ కార్యకర్త ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ లీలమ్మ,హెల్త్ సూపర్వైజర్ పార్వతి,స్వరూపారాణి,హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్,నర్సింగ్ ఆఫీసర్ కృష్ణ,డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్,ఏఎన్ఎం శారద మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో ఇందిరమ్మ ఇల్లు మున్సిపల్ చైర్మన్...

**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ బుధవారం రోజున పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ప్రమాణాలు పాటిస్తూ నాణ్యత ప్రమాణాలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం వార్డులో పారిశుద్ధ్య పరిస్థితిని అధికారులు, సిబ్బందితో కలిసి చూశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కమీషనర్ కె శ్రీనివాస్ రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

### చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గంతో తొలి సమావేశం....

### మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్దే నా ధ్యేయం...

### చౌటుప్పల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

చౌటుప్పల్, మార్చి 25, ప్రభాత సూర్య : చౌటుప్పల్ మున్సిపాలిటీని ఎమ్మెల్యే కొమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం చౌటుప్పల్ పురపాలక సంఘం నూతన పాలకవర్గం సభ్యులతో మొట్టమొదటి సమావేశంను మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణాభివృద్ధియే లక్ష్యంగా సాగిన సుదీర్ఘ సమావేశంలో ఎజెండాలోని పలు కీలక అంశాలపై పాలకవర్గ సభ్యులచే చర్చించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ మాట్లాడుతూ... చౌటుప్పల్ మున్సిపాలిటీని పార్టీలకు అతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళదామని అందుకు ప్రతి వార్డు కౌన్సిలర్‌కు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు .అదే విధంగా కౌన్సిలర్లందరూ పట్టణ అభివృద్ధి కోసం తనకు సహకరించాలని ఆమె కోరారు.సమావేశంలో చైర్ పర్సన్ స్వయంగా ఎజెండాలోని ప్రతి అంశాన్ని చదివి సభ్యులకు వినిపించారు. ప్రతి అంశంపై కౌన్సిలర్లతో చర్చించి, అవసరమైన చోట మున్సిపల్ కమిషనర్ ని వివరణ కోరారు. ఎజెండాలోని అంశాలపై లోతైన అవగాహన చేసుకున్న అనంతరం, కొన్ని అంశాలను సవరించాల్సిందిగా కమిషనర్ కి సూచిస్తూ, మరికొన్ని ముఖ్యమైన ప్రజాహిత నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధి తన ప్రధాన ఎజెండా అని ,అందరినీ సమానంగా చూస్తానని, అభివృద్ధిలో అన్ని వార్డులకు ప్రాధాన్య ఇస్తానని తెలి తెలిపారు. పట్టణంలో సమస్యలు కొత్తవి కావని ప్రజల సమస్యలు పరిష్కరిం చడానికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొనీ తమని తాము పరిచయం చేసుకొని పట్టణ అభివృద్ధికై మేమంతా ముందుంటామని తెలిపారు. ఈ సమావేశం చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఒక కొత్త అధ్యయనానికి నాంది పలికిందని పాలకవర్గ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 20 వార్డుల కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నవీన్, మండల వైద్యాధికారి సిహెచ్ కాటమరాజు, వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఉన్నతాధికారులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దీప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆశా వర్కర్ల నిరసన

**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి25:** మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆశా వర్కర్లు గత రెండు నెలల నుండి తమకు జీతాలు రావడం లేదంటూ వెంటనే జీతాలు ఇప్పించాలని ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డిఎంహెచ్ఓ వినతి పత్రం ఇవ్వడం కోసం వెళ్లగా డిప్యూటీ డీఎంహెచ్వో లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు మినిమం వెజ్ అమలుచేస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారని వారు అన్నారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న నేటి వరకు మాకు కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. 20 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు గ్రామాల్లో ఏ రోగాలు ఉన్నాయి, వారికి ఏ రకమైన చికిత్సలు అందించాలి , గర్భిణీలను ఆస్పత్రులకు తీసుకెళ్లి డెలివరీలు చేయించేది ఆశాలు మాత్రమే, ఆరోగ్య సర్వేలు చేయించేది ఆశా వర్కర్ల తోనే అని వారి బాధలను వెలిబుచ్చారు. ఆశా వర్కర్లకు చాలి చాలని వేతనాలతో తమ జీవనం కొనసాగిస్తున్నామని ఆశ వర్కర్లు వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆశలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పర్మినెంట్ సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంధ్య, లతా, అనుపమ, సుశీల, ఎం జమున, దేవి, సుధారాణి, పి అనిత, వి.లత, పి రాణి, డి మంజుల, వి జ్యోతి, ఆర్ లక్ష్మి, కృష్ణవేణి, ఇందిరా, చంద్రకళ, జి లక్ష్మి, రేఖ, సుజాత, లత, రాణి, మమత, జ్యోతి, ఆర్ లక్ష్మి, రత్న, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.



# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

### ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్దానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది.




## సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చలో అసెంబ్లీ కార్యక్రమం

### గిరిజన నాయకులను ముందస్తు అరెస్టు చేసిన హత్నూర పోలీసులు

**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి 25:** గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ గుడిని హైదరాబాద్ మహానగరంలో ఏర్పాటు చేయాలని గిరిజన జన సమితి ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు తరలి వెళ్తుండగా హత్నూర మండలానికి చెందిన గిరిజన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో తెల్ల రాళ్ల తాండకు చెందిన ఉపసర్పంచ్ నామ్య నాయక్, శ్రీనివాస్, కుమార్, జయసింగ్ తదితరులు ఉన్నారు.

# ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో రైతులకు వెన్నుదన్నుగా సహకార సంఘాలు....





**ఆలేరు, మార్చి 25, ప్రభాత సూర్య.:** ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాథమిక సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆఫీస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం రోజున ఆలేరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓ వెంకట్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని అన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించడంలో సంఘాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సాంకేతికతను అనుసంధానించి పారదర్శకతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నాయని ఆయన కొనియాడారు. రైతుల అభివృద్ధి కోసం సహకార సంఘాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో మాజి డైరెక్టర్ గవ్వల నర్సింహులు, అరె మల్లేశం, శేఖర్ రెడ్డి, మంతపురి గ్రామ సర్పంచ్ పసుల సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ దంతూరి స్వామి, రైతులు నర్సింహులు, బాలయ్య, సిబ్బంది ప్రభాకర్, సంజయ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు. తులకు వెన్నుదన్నుగా సహకార సంఘాలు...ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాథమిక సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆఫీస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం రోజున ఆలేరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓ వెంకట్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని అన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించడంలో సంఘాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సాంకేతికతను అనుసంధానించి పారదర్శకతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నాయని ఆయన కొనియాడారు. రైతుల అభివృద్ధి కోసం సహకార సంఘాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో మాజి డైరెక్టర్ గవ్వల నర్సింహులు, అరె మల్లేశం, శేఖర్ రెడ్డి, మంతపురి గ్రామ సర్పంచ్ పసుల సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ దంతూరి స్వామి, రైతులు నర్సింహులు, బాలయ్య, సిబ్బంది ప్రభాకర్, సంజయ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## కటిక కుటుంబాన్ని పరామర్శించిన జనగాం ఉపేందర్ రెడ్డి..,



**ఆలేరు మార్చి 25 ప్రభాత సూర్య :** ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో ఇటీవల చనిపోయిన కటిక రామచందర్ వారి కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి ఈ సందర్భంగా వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కొల్లూరు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీపాల్ రెడ్డి , కొల్లూరు సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి , ఆలేరు వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ యాదవ్ ,మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య, ఉప సర్పంచ్ గాజుల దశరథ ,ఆలేరు మండల అధ్యక్షురాలు గ్యాదపాక దీప ,వార్డ్ మెంబర్ అచ్చినీ బిక్షపతి , కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాత్రి లక్ష్మయ్య , గ్యాదపాక మల్లేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు గాజుల కరుణాకర్ , బండి పరమేష్, బండి మల్లేష్ లు కాంగ్రెస్ కొల్లూరు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో కందకం కబ్జా వల్లనే డ్రైనేజ్ సమస్య

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 25(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గతంలో కొందరు కందకం కబ్జా వల్లనే డ్రైనేజీ సమస్య ఏర్పడింది. గతం లో కబ్జాకు గురైన కందకాలను అధికారులు, పాలకవర్గం పట్టించుకోని కబ్జాలకు గురైన కందకాలను గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

## చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజలు

తిరుపతి: చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లతో కలకలం రేగింది. సోమవారం అర్ధరాత్రి కోట పడమర ప్రవేశ ద్వారం వద్ద నడిరోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి వింత ఆకృతులతో ముగ్గులు వేసి ఉన్నారు. కోటకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా నడిరోడ్డుపై పూజలు ఎలా చేశారనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గతంలో కూడా గుప్తనిధుల కోసం అనేకమంది పూజలు చేసి వుండడంతో ఈ విషయాన్ని పురావస్తుశాఖ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు.

## పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తతలు

### కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ దాడి

టెహ్రాన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు రోజు రోజుకీ భీకర స్థాయికి చేరుకుంటున్నాయి. యుద్ధం మొదలైనప్పటికి నుంచి గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. తాజాగా కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్రోన్ ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌కు చెందిన ఒక డ్రోన్లు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా దాడులకు దిగాయి. అందులో ఒక డ్రోన్ విమానాశ్రయ పరిసరాల్లోకి దూసుకువచ్చి అక్కడే ఉన్న ఆయిల్ ట్యాంకర్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదం దాటికి ట్యాంకర్ పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. విమానాశ్రమం పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ డ్రోన్లతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. తాజా దాడి కువైట్ భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంటలు అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇరాన్ నుంచి వచ్చిన పలు డ్రోన్లు, క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, కేవలం ఆస్తి నష్టం జరిగిందని కువైట్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది.

## తేనెటీగల దాడితో పరుగులు

### గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

నంద్యాల: శ్రీశైలం డ్యామ్ వద్ద తీవ్ర విషాదం నెలకొంది. తేనెటీగల దాడిలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. పిల్లి వీరస్వామి(52) అనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్.. శ్రీశైలం డ్యామ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగా వీరస్వామిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. విపరీతంగా కుడుతుండడంతో తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో పరుగులు తీశారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. కానిస్టేబుల్ మృతి బాధిత కుటుంబం, డిపార్ట్‌మెంట్‌లో తీరని శోకాన్ని మిగిల్చింది.

## తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిన కూతురు

### పోలీసుల దర్యాప్తులో అంగీకిరించన నిందితురాలు

హైదరాబాద్): నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది. ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజు అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్రమంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియుడు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది.

## సీట్లు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే !

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్దం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ



బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నలనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37-38కి, అసెంబ్లీ సీట్లు 262-263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్ట్రాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి.

లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

### అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పరిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.